# పడమట సంధ్యారాగం

వలివేటి నాగచంద్రావతి



సముద్ర తీరం వెలుగూ నీడా దోబూచులాడుతున్న మునిమాపు వేళ.

భూమ్యాకాశాన్ని కలుపుతున్న క్షితిజాన్ని మౌనంగా వీక్షిస్తున్నారు ఆ యువతీయువకులిద్దరూ.

ఆ ఇద్దరి మనస్సుల్లోనూ మెదులుతున్నదొకే ఆలోచన. ప్రేమమైకంలో అన్నీ తెలిసిన తామే ఆ రేఖకు ఎంత అజ్ఞానపు తెలివితక్కువ వివరణలు ఇచ్చేవారమో'. అని

"ఆకాశరాజు ఒంగి భూదేవిని ముద్దాడుతున్నాడు" అనేది వసుధ చిలిపిగా.

"వారిది విడిపోని బంధం" అనేవాడు మౌళి పరవశంగా,

'ఎంత పిచ్చి భ్రమ అది. అవి ఏనాడూ కలవవు కలవలేవు'

నిట్టూర్చి లేచింది వసుధ.

"వెడదమా?"

'ఊఁ... కానీ జతగా కాదు. విడివిడిగా. వేరేవేరే దారుల్లో" అన్నాడు మౌళి. అతని కంఠం ఒణికింది బాధతో.

"అవును. తప్పదు" భారంగా అంది వసుధ.

ఇరువురి కళ్లు నీళ్లతో నిండాయి.

మొన్నమొన్నటి వరకూ ఇక్కడే – ఈ సాగరుడి సమక్షంలోనే ఒకరి సరసన ఒకరు కూర్చుని, ఒకరి చేతిలో మరొకరి చేయుంచుకుని, ఒకరి కళ్లలోకి ఒకరు చూసుకుంటూ తామిద్దరూ కలిసి గడపబోయే బంగారు కాలాన్ని గురించి కలలు కనేవాళ్లు.

తమ ఉజ్వల భవిష్యత్‌ని ఒకరు ఊహిస్తూ వర్ణిస్తూంటే ఇంకొకరు ఆ ఆకాశ హర్మ్యాలను మనోనేత్రాలతో తిలకిస్తూ మురిసిపోయేవారు.

ఆ బాసలు ఆ ఊసులు ఇప్పుడేమవుతున్నాయి.

ఎందుకిలా తమ ప్రేమ మూనాళ్ల ముచ్చటగా ముగిసింది?

అప్రయత్నంగానే వారి మనసులు తమ అనురాగ పరిణామక్రమాన్ని తడిమాయి.

తొలిచూపులో పుట్టిన ప్రేమకాదు వారిది. రెండేళ్లపాటు యూనివర్సిటీలో కలిసిమెలిసి మనసులు కలబోసుకున్న అనుబంధం.

మౌళి గొప్ప అందగాడేమీ కాదు. ఆజానుబాహువూ అరవింద దళాయతాక్షుడూ అసలే కాదు. చామనఛాయలో అతిసామాన్యమైన యువకుడు.

అతని అందమంతా సౌమ్యత కురిపించే అతని చూపులో ఉంది. స్నేహం పరిమళించే అతని మాట తీరులో ఉంది. యూనివర్సిటీలోనే బెస్ట్ స్టూడెంట్‌గా, బ్రిలియంట్ స్టూడెంట్‌గా పేరు తెచ్చుకుంటున్న అతని ఇంటెలిజెన్సీలో ఉంది.

వసుధ ఆకర్షితురాలయింది ఈ అందాలకే.

ముఖ్యంగా నలుగుర్లో కలవటానికి బిడియపడుతూ వెనకవెనకగా ఉండే మౌళి ఏ సబ్జెక్ట్ మీదైన మాట్లాడాలిసివస్తే, ఆ బిడియం ఎక్కడ దాక్కునేదో అనర్గళంగా దామీద అథారిటీతో ఎదుటివాళ్లకి ఒలిచిపెట్టినట్టు అర్థమయ్యేలా మాట్లాడేవాడు. ముగ్ధురాలయి , వినేది వసుధ.

ఆమెకు నచ్చిన మరో అంశం అతని మంచితనం.

అందరూ విసుక్కుంటూ వదిలించి వేస్తున్న ముసలి మాలికి బిచ్చగత్తెను అతను ఆదరంగా చెయ్యి పట్టుకు రోడ్డు దాటించడం, నడిచేదారిలో ఏ రాయోరప్పో అడ్డొస్తే తొక్కి కుంటితే వాళ్ళెందుకని అందరిలానే పక్కనుంచి తప్పుకుపోక జాగ్రత్తగా తీసి పక్కకి వేసి రావటం లాంటివి అతను ఎవరేమనుకుంటారో అన్న మొహమాటం కానీ వెనకాముందాలోచనగానీ లేకుండా చేసేసేవాడు. ఈ గుణాన్ని చాలా ఇష్టపడేది వసుధ.

నవ్వుతూ తుళ్లుతూ తుళ్లిగింతలతో గలగలపారే సెలయేరులాంటి వసుధ సహజ సౌందర్యవతి. చైతన్యానికి ఉత్సాహానికి ప్రతీక. కాలేజీలో జరిగే అన్ని యాక్టివిటీస్‌లోనూ ఆమెదే ముందడుగు. తనలోలేని ఈ క్వాలిఫికేషన్స్ మూలంగానే వసుధ అంటే మౌళిలో ఆరాధనా భావం మొలకెత్తింది. మేరువయ్యింది.

ఒకరంటే ఒకరికి కలిగిన సదభిప్రాయమే ఇద్దర్నీ దగ్గరకు చేర్చింది. స్నేహాన్ని పెంచింది. అదే అనురాగంగా రూపు దిద్దుకుంది.

సముద్రతీరం వారి ప్రేమ సామ్రాజ్యానికి రాజధాని అయ్యింది.

ఏవో ఊసులు చెప్పుకునేవారు. ఎన్నో బాసలు చేసుకునేవారు. అందులో కులమతాల ప్రసక్తి లేదు. అంతస్తుల ప్రమేయం అంతకన్నా లేదు. కాకపోతే, పోస్ట్‌గ్రాడ్యుయేట్లం. మనకాళ్ల మీద మనం బ్రతగ్గలం. ఒకరి ఇష్టాయిష్టాలతో నిమిత్తమేమిటన్న ధీమా మనసు మారుమూలలో ఉండేది.

కానీ వివాహబంధంతో ఆ ప్రేమను పరిపక్వం చేసుకుందామనుకున్న సమయానికి విశ్వరూపం దాల్చి అడ్డుగా నిలబడ్డవి ఆ కులమూ అంతస్తులే. ఖాతరు చెయ్యక్కర్లేదనుకున్న ఆ తల్లి దండ్రులే.

"నిప్పులు కడుక్కున్న వంశం మనది., నా హయాంలో నువ్వా అప్రాచ్యపని చేస్తే నేనొప్పుకోను. కాదంటావా చెప్పు - మేమంతా గన్నేరు పప్పు నూరుకు తాగుతాం. ఆ తర్వాత నీఇష్టమొచ్చినట్టు చేసుకో" అన్నాడు మౌళి తండ్రికి నిక్కచ్చిగా.

నిజానికి కులం గోత్రం అనేవి ఆయన పైకి వెళ్లబోస్తున్న ఘోష. లోపల ఇంకో భయం పనిచేస్తోందాయనకి. పెద్ద చదువులు చదివి ఇవ్వాళ రేపూ చేతికందొస్తాడనీ, తన భుజం మీదున్న సంసారభారం అతని తలకెత్తుదామని ఆశపడుతున్నడా బక్కజీవి.

కొడుకు ఇప్పుడీవిధంగా ఒక మల్టీ మిలియనీరు కూతుర్ని పెళ్లాడి ఏ అమెరికానో ఎగిరిపోతే ఆ వెనక ఎదిగిన ఇద్దరాడపిల్లలకీ పెళ్లిళ్లు చెయ్యడం, ఇంకా హైస్కూల్ దాటని రెండో కొడుకుని ప్రయోజకుణ్ణి చెయ్యడం, మందులతో పావువంతు సంపాదనని తాగేస్తున్న ముసలి తల్లిని సాకడం ఇవన్నీ కొడుకు సాయం లేకుండా అరవయ్యోపడిలో పడ్డిన తన వల్లయ్యే పనులేనా? 'మౌళి వెళ్లిపోతే తన గతేమిటి?' అన్న బెంగ ఆయనది.

నిజంగానే గన్నేరు పప్పు నూరుకు కూర్చున్నా డాయన.

ఇక వసుధ తండ్రి విపరీతమైన సుపీరియర్ కాంప్లెక్స్ పెంచుకున్న మనిషి. ఆ అహంభావం ఆయనలో ఏ లెవెల్లో ఉన్నదంటే తనలాంటి గ్రేట్ పర్సన్ నివసించే అర్హత ఈ ఇండియా వంటి ఛాందస దేశానికి లేదనుకునేటంత.

అందుకే ఆయన తన కంపెనీలన్నిటికీ అమెరికాతో లింకులు పెట్టుకున్నారు. మెల్లగా తనూ అక్కడే స్థిరపడిపోవాలని ఆయన ఆలోచన.

ఆ ప్రయత్నంలో భాగంగానే కూతురికి ఇండియానుంచి వెళ్లి అమెరికాలో స్థిరపడిన ఓ యువ పారిశ్రామికవేత్తతో ఆల్‌రెడీ సంబంధం ఫిక్స్ చేసేశాడు కూడా.

ఇలాంటి సమయంలో తన కూతురు నేలబారున పాకే ఒక పిపీలికాన్ని పెళ్లాడుతానంటే, నింగినంటే శిఖరాలకు మాత్రమే చూడగోరే ఆ మహానుభావుడు అంగీకరిస్తాడా - ఊహూ.

వెంటనే పిస్టల్ తీశాడు. "నా ఫ్యూచర్ ప్లాన్లకి ఆటంకమయ్యే కీటకాల్ని నలిపెయ్యటానికి నేనెప్పుడూ వెనకాడను. చెప్పు. ఎవడువాడు!" అని గర్జించాడు.

నిరుత్తరాలయింది వసుధ.

ఇంట్లోంచి పొమ్మనో, ఆస్తి ఇవ్వననో బెదిరిస్తాడనుకున్నది కానీ ఇలా ప్రాణాలదాకా తెస్తాడని ఆమె ఊహించలేదు.

తండ్రి ఎంతటివాడో వసుధకి తెలుసు. అలాంటివాళ్లు తలుచుకోవాలే కానీ చేతికి మట్టి అంటకుండా రాత్రికిరాత్రే శాల్తీని మట్టిలో కలిపేయగలరు.

తెగించి ఏ నిర్ణయమైన తీసుకోడానికి ప్రాణప్రదంగా ప్రేమించిన వాణ్ణి బలిపెట్టాలిసి వస్తుందని తెలిసీ ఎలా సాహసించగలదు?


అలాగ పెద్దలు వారి ప్రేమకు ప్రతిబంధకమయ్యేరు. తాము దూరం కాక తప్పదని నిర్ధారణయి పోయింది ఇద్దరికీ.


చివరిసారిగా వారి ప్రేమానురాగాలకి మూగసాక్షి అయిన సముద్ర తీరాన కలుసుకున్నారు.

ఆఖరి కలయిక ఇది. ఏవో చెప్పుకోవాలనీ భారం కొద్దిగానయినా దింపుకోవాలనీ ఆరాటం. కానీ గుండెనిండా నిండిన విషాదం పెదవుల్ని విడివడనీయటం లేదు.

కలసిన మనసులు బలిమిని విడివడుతూ చేసే ఆక్రందన కనులను చెమరింప జేస్తోంది.

"ప్రియతమా శెలవు" అంటూ తడిసిన






కనులు మన భాషలో వీడ్కోలు తీసుకుంటున్నాయి.

చేతులు కలిపి నడవాలనుకున్న వారి బాటలు చీలిపోయాయి.

000

ఎన్నో దినాలు వత్సరాలుగా వత్సరాలు దశాబ్దాలుగా కదులుతూ కాలగర్భంలో కలిసిపోయాయి.

"తాతా, నీకు ఉత్తరం"

పడక కుర్చీలో వాలి "భోజనం వడ్డించాను" అనే కోడలి పిలుపుకోసం కనులు మూసుకు ఎదురుచూస్తున్న మౌళి ఒళ్లోకి విసిరి తుర్రుమన్నాడు వర్ధన్.

కళ్లు తెరిచి సరిగా లేచి కూర్చుంటూ బరువుగా ఉన్న ఆ కవరు చేతిలోకి తీసుకున్నాడు మౌళి.

కవరు మీది వ్రాత చూడగానే ఒక్కసారి గుండెనెవరో కుదిపినట్టుగా అయింది.

అది వసుధ దస్తూరి.

'ఎన్నాళ్లకి... ఊఁహూఁ... ఎన్నేళ్లకి మళ్లీ వసుధ పలకరింపు' ఉద్వేగంతో వేళ్లు వణుకుతుంటే కవరు తెరవడం సాధ్యంకాక చేతులమధ్య ఉత్తరాన్ని హత్తుకున్నట్టుగా నొక్కిపట్టి తిరిగి కళ్లు మూసి వెనక్కి వాలాడు మౌళి,

ఏనాటి వసుధ!

యూనివర్సిటీ వదిలాక ఆమె పెళ్లిచేసుకున్నదనీ తండ్రితో సహా అమెరికా వెళ్లిపోయిందనీ మాత్రం తనకు తెలుసు అంతే. మళ్లీ ఇన్నేళ్లకు... ఇలా...

మూసిన రెప్పల వెనుక తడితేరుతూ వసుధను కోల్పోయిన తన జీవనయానం ఎంత భారమై కదిలిందీ గమనానికి తెస్తోంది.

000

వసుధ ఎడబాటుతో శరీరానికి ఉత్సాహాన్నిచ్చే గ్రంధి ఏదో తొలగించినట్టు నిస్తేజుడయ్యేడు మౌళి.

మొదలే మితభాషి. మరింత గంభీరుడయ్యేడు. దేన్లోనూ ఆసక్తి కానీ అనురక్తి కానీ లేని విరక్తుడయ్యేడు.

కేవలం కర్తవ్యాలూ, బాంధవ్యాలూ మాత్రమే అతణ్ణి జీవితానికి విముఖుణ్ణి కానీకుండా ఆపేయి. నిలిపేయి. జీవన స్రవంతిలో పడవేశాయి.

అతని క్వాలిఫికేషన్ అతనికి మంచి ఉద్యోగాన్నే సంపాయించిపెట్టింది. ఆవెంటనే తల్లీ తండ్రి కోరినట్టుగా గృహభారాన్ని స్వీకరించాడు.

ఇద్దరు చెల్లెళ్లకూ పెళ్లిళ్లూ చేశాడు. తమ్ముణ్ణి పెద్ద చదువులు చదివించాడు. అమ్మానాన్నల అభిమతం కాదనకుండా తనూ పెళ్లి చేసుకున్నాడు.

ఎన్ని చేసినా ఎన్ని సంబరాల్లో పాల్గొన్నా ఎన్ని మెట్లధిరోహించి పైకెదిగినా ఏదో కొరత, ఏదో వెలితి కత్తిలా అతన్ని పక్క కోస్తూనే ఉంది.

మౌళి భార్య సాధ్వి. నిజంగా సాధ్వే.

భర్త తన పట్ల అలసత్వం ప్రదర్శిస్తున్నా, ఎంతసేపూ నా చెల్లెళ్లూ, నా తమ్ముడూ, మా అమ్మానాన్న అంటూ వాళ్లనుద్ధరించటమే తన జీవిత పరమావధి అన్నట్టు ప్రవర్తిస్తున్నా, అతను సంకల్పించినది నెరవేర్చటమే తన ధ్యేయమన్నట్టుగా భర్తకి ప్రతిపనిలోనూ సాయపడిందే తప్ప ఇదేమని అడగనేరని ఉత్తమ ఇల్లాలు.

మేదకురాలూ, అనుకూలవతీ అయిన భార్య అంటే మౌళికి గౌరవమూ అభిమానమూ కలిగాయి. తన సుగుణాలతో ముందు ముందు అతని అనురాగాన్ని కూడా చూరగొనగలిగేదేమో కానీ ఆ మంచికాలం రానేలేదు.

మొదటి ప్రసవంలో సృష్టి చేప అతన్ని విడిచి వెళ్లిపోయింది సాధ్వి.

ఆ తర్వాత సంసార జీవితం మీద మనసు విరిగిపోయింది మౌళికి. బిడ్డకోసమైనా మళ్లీ పెళ్లి చేసుకొమ్మని తల్లి ఎంత పోరుపెట్టినా మౌళి మెత్తపడలేదు.

తల్లి బ్రతికున్నన్నాళ్లూ మౌళి కొడుకు వంశీని ఆవిడే పెంచింది. ఆ తర్వాత హాస్టల్లో చేర్పించి చదివించాడు.

ఉద్యోగం చేస్తూ బాగా సంపాదిస్తున్నన్ని నాళ్లూ తమ్ముడూ చెల్లెళ్లూ అతనికి ఒంటరితనం అగుపడనీకుండా మా అన్నయ్య మా అన్నయ్య అంటూ వచ్చిపోతూండేవాళ్లు.

పండక్కీ పబ్బానికీ వచ్చి ఇల్లు సందడితో నింపేవాళ్లు. ఉన్నదంతా ఖర్చుచేయించి వెళ్లేవాళ్లు. ఇబ్బందులూ, కష్టాలూ ఏకరువు పెట్టి పి.యఫ్. లోను పెట్టించేవాళ్లు. అదీ లేకపోతే నోటు వ్రాయించి అప్పుచేయించి మరీ డబ్బు పట్టుకుపోయేవాళ్లు. యుక్తిగా అన్ని అవసరాలకీ అన్నగార్ని అడ్డం వేసుకుంటూ "మాకు నువ్వు, నీకు మేము" అంటూ కమ్మగా కబుర్లు చెప్పేవాళ్లు.

రోజులు బాగానే గడిచేవి. నావాళ్లకు నేను చేసేది వృథా కాదు అనుకునేవాడు మౌళి.

రిటైరయ్యేముందు కొడుక్కి పెళ్లి చేశాడు. కోడలు కాపురానికి వచ్చింది. పగ్గాలు చేతికి తీసుకుంది. అప్పట్నించీ చెల్లెళ్లూ తమ్ముడూ రాకపోకలు తగ్గించేశారు. "అన్నయ్య నిన్ను పదిరోజులపాటు రమ్మందామంటే, పిల్లలు, చదువులు. ఇల్లు ఇరుకు. నీకు సదుపాయం ఉండదు" అంటుంది పెద్ద చెల్లెలు.

"అత్తా బిడ్డలున్న సంసారం. నా పెత్తనం సాగదు" విచారిస్తూ అంటుంది చిన్న చెల్లెలు. తమ్ముడు అలా సాకు చెప్పే ప్రయత్నం కూడా చెయ్యడు.

ఫస్టు తారీఖున పెన్షన్ తెచ్చుకోగానే అడిగి తీసేసుకుంటుంది కోడలు. ఒక్క వందరూపాయలు మాత్రం వదిలి.

రోజూ ప్రొద్దుట కాఫీ సాయంత్రం టీ ఇస్తుంది. రెండోసారి అడిగితే పనిలో ఉన్నాను అంటుంది. కొడుకుని స్కూలుకీ మొగుణ్ణి ఆఫీసుకీ పంపాక అతనికి టిఫిన్ పెడుతుంది. తన పని మొత్తం ముగించుకున్నాక "భోజనం టేబుల్ మీద సర్దాను. తినండి" అంటుంది. అతను వాడే వస్తువుల్ని తమవాటితో కలవనియ్యకుండా వేరే పెడుతుంది. పిల్లవాణ్ణి కూడా ఎక్కువగా మౌళి దగ్గరకు రానివ్వదు.

'తనూ, తన భర్తా, తన పిల్లలూ మాత్రమే తన కుటుంబం అనుకుంటున్నా రోజులివి. తనని పేయింగ్ గెస్ట్‌గా ట్రీట్ చేయడంలో కోడలు తప్పేముంది?' అనుకుంటాడు మౌళి.

కొడుకుతో మునుపటి టచ్ తప్పినే అతనికి. అంతేకాక అతనిలాగే వంశీ కూడా మొహమాటస్తుడు. పెళ్లి. ఒక్కొక్క వాడు మరీ ఒంటరితనం ఫీలింగ్ బాధిస్తుంటే తట్టుకోలేక 'నా అన్నవాడు వంశీ ఒక్కడే కదా' అనుకుంటూ కొడుకుకి సన్నిహితంగా వెళ్లలేకపోయాడు. తండ్రిని చూడగానే కూర్చున్నవాడల్లా ఇంట్లోకో బయటకో వెళ్ళిపోయేవాడు వంశీ.

కల్లాకపటం తెలియని పసివాడు వర్షన్. అప్పుడప్పుడూ దగ్గరికొస్తాడు. ఒళ్లో కూర్చుంటాడు. వాళ్లమ్మ పిల్చేదాకా స్కూల్ కబుర్లో స్నేహితుల కబుర్లో చెప్పి వెడతాడు.

'ఇదీ తన పరిస్థితి. అందరూ వ్యక్తిగా గుర్తింపు తగ్గుతూ ఒక ముసలాయనగా తప్ప, తనూ ఓ ప్రేమికుడినే తనకీ ఒక పూర్వ ప్రణయగాథ ఉందనే మరిచిపోతున్న ఈ సమయంలో ఈ లేఖ.'

.000

కంపిస్తున్న వేళ్లు ఆఖరుపులోకి వస్తున్నాయి. కళ్లు తెరిచి మెల్లగా కవరు విప్పాడు మౌళి.

"మౌళీ! నేను వసుధను. ఔను నీ వసుధనే. ఇన్నేళ్ల తరువాత ఈ పలకరింపేమిటని ఆశ్చర్యపడుతున్నావా! ఇప్పటికి గుర్తువచ్చానా అని విస్మయపడుతున్నావా?

మౌళీ! నమ్మగలవంటే ఒక్క మాట చెప్పనా! హృదయఫలకం మీద గాఢంగా ముద్రపడిన నీరూపం ఇప్పటికీ చెదరలేదు. ఇంక గుర్తు తెచ్చుకునే ప్రసక్తేముంది!

నిజమే. నీనుంచి దారి మళ్లించుకుని ప్రయాణించే ముందు నిన్ను మరిచిపోవాలనే నిర్ణయించుకున్నాను. నేనడుగిడబోయే బ్రతుకులో స్వచ్ఛంగా, మనస్ఫూర్తిగా కలిసిపోవాలనే తలచాను. కానీ నేను పాదం మోపినచోట ఆ వాతావరణం, పరిస్థితులు నా ప్రయత్నాలకి ఏ మాత్రం దోహదపడలేదు.

భర్తగా నాతో బంధమేర్పరుచుకున్న ఆ వ్యక్తి మా నాన్న అనుకున్నట్టుగా ఇండస్ట్రియలిస్ట్ మాత్రమే కాదు - ఫక్తు మెటీరియలిస్ట్ కూడా.

అతడు నా జీవితాన్ని అతలాకుతలం చేశాడు. ఇంద్రధనుస్సై వెల్లివిరుస్తుందనుకున్న నా జీవితాన్ని నిస్సారంగా బందిఖానాగా మార్చివేశాడు.

బిజినెస్ అతని ప్రపంచం. అందులో లాభనష్టాల బేరీజులూ, అడిట్లు, విజిట్లు, ఇన్‌కమ్‌టాక్స్ రైడింగులూ, పోటీదార్ల బేటీలు, ఎత్తులు జిత్తులు... వీటికి తప్ప మరివేటికీ చోటు ఉండదు. చివరికి కట్టుకున్న నేను కూడా అతని దృష్టికి నిమిత్తమాత్రురాలినే.

నీరు నూనెలా కలవని గుణాలు మావి. మా కాపురంలో అభిమానించే ఆర్ద్రత లేదు. పులకరింతలు రేపే స్పందనలు లేవు. హాయిగా నవ్వుకున్న ఘటనలు లేవు. మనసు విప్పి మాట్లాడుకునే నైర్మల్యం లేదు. ఉన్నవల్లా యాంత్రికత. అవసరం. అంతే.

ఆ ఇంట్లో ఆ మనిషి దగ్గర ప్రాణమున్న రోబోట్‌గా బ్రతకటానికి నేను చాలా నిగ్రహాన్ని కూడగట్టుకోవల్సి వచ్చేది.

మనసును ఆవరిస్తున్న స్తబ్ధతను తప్పించుకుంటూ, ఉత్సాహాన్ని ప్రోదిచేసుకుంటూ కృష్ణశాస్త్రినీ, రవీంద్రుణ్ణీ మళ్లీ మళ్లీ చదువుకునేదాన్ని. మొక్కల మధ్య తిరిగేదాన్ని. మంచి సంగీతం వినేదాన్ని. పిల్లల్ని పోగుచేసి ఆటలాడేదాన్ని.

అదీ అతనికి కిట్టేదికాదు. అసలలాంటి పనికిమాలిన టైమ్‌వేస్ట్ పనుల్లో ఆనందం లభిస్తుందనడమే వింతగా ఉండేదతనికి.

పోనీ ఎవరి అభిరుచి వారిది అనుకోగల సంస్కారమూ లేదు. మోజు అమెరికన్ కల్చర్‌పైనే అయినా బుద్ధి ఇండియానే. 'భార్య భర్త మాట జవదాటరాదు. తనకో స్వంత ఇష్టానిష్టాలుండరాదు.'

నేను చదివే కవిత్వం చెత్తట. ఆటలాడ్డం పాటలు వినడం పిచ్చట. తోచకపోతే పార్టీలకు వెళ్లాలట. ఇంకా ఉత్సాహం ఉంటే నేనే ఏం పెంపుడు కుక్క బర్త్‌డే సందర్భాన్నో వంకగా ఫంక్షన్ అరేంజ్ చేసి అందర్నీ ఆహ్వానించాలిట.

పోనీ అంటే అందులోనూ రాజకీయమే. తనకంటే పైఎత్తున ఉన్నవాళ్లతో ఆవులన్నట్టు పులుముకు తిరగాలట. సరిసమానులతో మందహాసం చిందించాలి. దిగువనున్న వాళ్లతో నొసలు పైకి విసిరి హుందా వెళ్లబోయాలట. ఇవన్నీ ఒక ఎత్తైతే మనకు అవసరపడిన వాళ్లుంటారు. వాళ్లతో భుజాలు రాసుకోవాలి. మాటల్లో చమత్కారం కురిపించి రంజింపజేయాలి. చాతుర్యంతో వారిద్వారా వ్యవహారాలు చక్కబెట్టుకోవాలి. అంటే - స్నేహితులతో హాయిగా గడిపే కాలక్షేపమని పైననడమే కానీ అసలు కారణం మళ్లీ ఆ వ్యాపారమేనన్నమాట.

నేనా కృత్రిమత్వంలో, మెటీరియల్ ధోరణిలో ఇమడలేకపోయాను. నా వ్యతిరేకత అతనిలో ఆగ్రహాన్ని రేపేది. ఫలితంగా ఇద్దరిమధ్యా వాదనలు, ఘర్షణలు. ఉత్తరదక్షిణ ధృవాల్లా ఎడమొహం పెడమొహం.

ఏళ్లు గడుస్తున్నా మా విభేదాలు మరింత పెరిగాయే కానీ తరగలేదు. నేనెంత ప్రయత్నించినా బుద్ధితో ఆలోచించే అతనికీ మనసుతో ఆలోచించే నాకూ పొత్తు కుదరలేదు. నా చదువు, విజ్ఞానం, అందం, ఐశ్వర్యం ఏవీ - ఏవీ కూడా మాకొచ్చే సమస్యలను పరిష్కరించి మామధ్య సామరస్యం కుదర్చలేకపోయాయి.

తరచూ మా నాన్నతో నామీద కంప్లైంట్ చేసేవాడతను. నాన్న నా సంజాయిషీ వినేవారు. నా నిర్దోషిత్వాన్ని ఒప్పుకుంటూనే అల్లుణ్ణి సమర్థించేవారు. "మొగుడు మగాడు నువ్వే సర్దుకుపోవాలి" అని నాకు సుద్దులు చెప్పేవారు.

కానీ ఎంతకని వ్యక్తిత్వాన్నీ, ఆత్మాభిమానాన్నీ చంపుకోను? అలాగని ఎన్నిటికి ఏటికి ఎదురీదను? మానసికంగా ఎంత నలిగిపోయేదాన్నో, ఎంత చిత్రవధ అనుభవించేదాన్నో. వ్యధా వేదనా కళ్లు మూతపడనివ్వక నిద్రరాని రాత్రులు ఎంత కుమలజేసేదో - ఒక్క స్వాంతన వచనం కోసం



మన సెంత పరితపించేదో -

అప్పుడల్లా నువ్వు గుర్తుకొచ్చేవాడివి. మనసున మనసై మసలిన నిన్ను తలచుకుని, 'నేస్తమా ఎక్కడున్నావు? నా ఆర్తి నీకు తెలియడం లేదా?' అని లోలోపలే ఆక్రోశించేదాన్ని.

జస్ట్ మానాన్నకోసం... నన్ను కన్నతల్లి పురిట్లో కళ్లు మూస్తే, మళ్లీ పెళ్లిమాట తలపెట్టక నన్నింతదాన్ని చేసిన నా తండ్రి మాట కాదనలేక యుద్ధం - శాంతి. యుద్ధము - శాంతి ప్రాతిపదికమీద శత్రువుతో కలిసి ఒకే చెరసాల గదిలో బతికినట్టు ఆ ఇంట్లో పదిహేనేళ్లు అతనితో గడిపాను.

మళ్లీ మానాన్నే అతనికి ఇంకో సంసారం పిల్లలూ ఉన్నారనీ, అతని ప్రేమాభిమానమూ అక్కడేననీ స్టేటస్ సింబల్‌గా మాత్రమే నన్ను పెళ్లాడాడనీ నాకు సంతానం కలగక పోవడానిక్కూడా అతని ఎత్తుగడే కారణమనీ తెలిసి కదిలిపోయాను; అతన్నించి బంధవిముక్తికి అనుజ్ఞ ఇచ్చారు.

నేను నాన్న దగ్గరికి వచ్చేశాను. రెండేళ్లకిందట నాన్న ఈలోకం నుంచి నిష్క్రమించారు.

నేను ఏకాకినయ్యేను. స్వేచ్ఛాజీవిని అయ్యాను. ఇక ఈ దేశంలో నాకెవరున్నారని? ఇండియా వచ్చేద్దామనుకున్నాను.


అప్పుడే నీ గురించి ఎంక్వయిరీ చేశాను. మనసుంటే మార్గం దొరుకుతుందంటారు. నిజం, హరిప్రసాద్ తెలుసుగా... నీ రూమ్మేటు, ఒక హాలిడే రిసార్ట్‌లో కలిశాడు. వాళ్లబ్బాయి బోస్టన్‌లో ఉద్యోగం చేస్తున్నాట్ట. హరితో మాట్లాడాను. నీ ఎడ్రస్‌తోపాటు డిటైల్గ్గా నీ సంగతులన్నీ చెప్పాడు.

అప్పుడే ఓ నిర్ణయానికి వచ్చాను. ఇండియా రావడమే కాదు. ఇక నీతోనే కలిసి బతకాలని నిశ్చయించాను."

000

అసంకల్పితంగా చేతిలో కాగితాలు చూస్తూ తుళ్లిపడ్డాడు మౌళి. 'ఏమిటీ వసుధ ధైర్యం' జీవితమనే నాటకంలో చివరి అంకానికొచ్చేసిన ఈ సమయంలోనా ఈ ప్రపోజల్! కష్టాలు పడిపడీ చిత్తచాంచల్యం కలగలేదు కదా!' చేతిలో కాగితాల కేసి జంకుగా చూస్తూ, తిరిగి నిదానంగా ఉత్తరాన్ని తెరిచాడు మౌళి.

'ఉలిక్కిపడ్డావా? నమ్మలేకపోతున్నావా? నాకు తెలుసు. ఇది చప్పున నలుగుడు పడే




విషయం కాదని. ఆలోచించు మౌళీ! విధి వ్రాతే అను. ఆజ్ఞ అతిక్రమించనీయని ఆత్మీయతే కారణమను. మనం ఆశపడ్డ జీవితానికి ఇద్దరం దూరమయ్యాం. సుదీర్ఘకాలం వాళ్ల శాసనాలకు బద్ధులమై ఆత్మను జోకొట్టుకుంటూ, మనసును ఓదార్చుకుంటూ గడిపేం. ఇన్నేళ్లకు ఆ పంజరం నుంచి మనకు విడుదల లభించింది.

కనీసం మనకు వరంగా లభించిన ఈ కాసిన్ని రోజులైనా స్వేచ్ఛగా మన ఇష్టానుసారంగా, మనకోసమే మనంగా బతగ్గూడదా చెప్పు.

అరవయ్యోపడి దాటుతున్నవాళ్లం. లోకవిరుద్ధంగా నడిచి నలుగురి నోళ్లలో నానటం తప్పించి ఈ వయస్సులో ఆనాడు కన్న కలలు నిజం చేసుకోగలమా అని నీవనుకోవచ్చు. నిజమే. ఆనాటి ప్రేమికులుగా ఆ స్వప్నాలు సాకారం చేసుకునే వేళ దాటిపోయిందని నాకూ తెలుసు. కానీ ఈనాటి స్నేహితులుగా కలిసిమెలిసి ఉంటూ పునశ్చరణ చేసుకోగలం. అదీ మధురమే కదా!

మౌళీ సమరాన్ని ముగించుకొచ్చిన స్థితి మనది. ఆ అలసట నుంచి తేరుకోవాలన్నా ఆగాయాలు మాను పట్టాలన్నా మనసును అర్థం చేసుకోగల సహచర్యం ఇప్పుడే చాలా అవసరం!

మన మనసులు ఒకటి. మనభావాలు, ఆలోచనలు, మన ఆశలు అభిలాషలు ఒకటి. నాకు నువ్వు, నీకు నేను కాక తగిన తోడు మరింకెవ్వరవగలరు నేస్తం!

మౌళీ మొన్నటి వరకూ ముగింపుకు దగ్గరకొచ్చేస్తున్న జీవితం 'నానుంచి ఏం పొందగలిగావ్. కనీసం ఏ చిన్ని జ్ఞాపకాన్నయినా ఆనందంగా తలచుకోగలవా?' అని నిలదీస్తుంటే నైరాశ్యంతో ముడుచుకుపోయేది నా మనస్సు.

ఇప్పుడు... నిన్ను చూడగలను అన్న భావన, నీ చెలిమి, నీ సన్నిధి, నీ సాంగత్యం మరలా నాకు లభ్యమవగలవన్న ఆశ హృదయంలో చేరుకుంటున్న శూన్యాన్నీ స్తబ్దతనూ పారద్రోలుతూ పోగొట్టుకున్నవన్నీ దొరికించుకుంటున్న సంతృప్తినీ, ప్రశాంతతనూ నింపుతున్నాయి.

పొద్దువాలే సమయంలో చంద్రోదయమవుతోందన్న ఆనందంలో తిరిగే నా ఊహలకు రెక్కలు వచ్చేస్తున్నాయి.

మిత్రమా ఆ ఊహా చిత్రాన్ని నీకు వినిపించనా!

కుటీరం లాంటి చిన్ని అందమైన ఇల్లు. ఇంటి చుట్టూ పూలమొక్కలు. పూపొదల నడుమ గెంతుతూ పరుగులు తీసే చెవులపిల్లులు.

నీకు గుర్తుండే ఉంటుంది. నెమళ్లజంట పెంచాలి అనుకునేవాళ్లం మనం. ఇప్పుడా కోర్కె నెరవేర్చుకుంటాను. నెమళ్లు వయ్యారాలు ఒలకబోస్తూ పెరట్లో తిరుగాడుతుంటే అద్భుతం కదూ!

రోజూ సూరీడు నిద్రలేవక ముందే లేచి ఇద్దరం వాకింగ్‌కు వెడదాం - తోవ పొడుగునా కబుర్లు చెప్పుకుంటూ. వస్తూనే దొడ్లో ఆ రోజు పూసిన పూబాలలన్నిటినీ ఓ మాటు పలకరిద్దాం. నేను కాఫీ పెట్టి తీసుకువస్తాను. నువ్వు కుందేళ్లకు మేత తినిపిస్తావు. ఇద్దరం కాఫీ సిప్ చేస్తూ పేపర్ తిరగేస్తూ ప్రపంచాన్ని ఓసారలా అలా చుట్టి వస్తాం.

ఆ తర్వాత - మ్యూజిక్ సిస్టమ్‌లో నుంచీ తలత్ మహ్మూద్... లేదా హేమంత్ కుమార్... వారి గానం మంద్రస్థాయిలో దేవలోకం నుంచీ దిగివచ్చే గంధర్వ సంగీతంలా హాయిగా గాలిలో తేలివస్తుంటే వింటూ బ్రేక్‌ఫాస్ట్, లంచ్ తయారుచేస్తాను.

ఆ పాట సాహిత్యంలో అగాధమైన అర్థాన్నీ, గుండెలోతుల్లోని విషాదాన్ని తాకి, కదిపి, కుదిపి వెలికి తీసి దాన్ని కనుల ద్వారా బయటకు నెట్టే ఆ రాగం యొక్క మహత్యాన్ని నాకు వివరించి చెబుతూ నువ్వు నాకు పనిలో సాయం చేస్తావు.

అయినా అది ఎంత వంట అని! నాలుగు ఐటమ్స్ చేసుకుని నాలుగు ముద్దలు ఎక్కువ కతకటానికి ఇద్దరికీ హెల్త్ ప్రాబ్లమ్సే కదా! స్మూత్‌గా గొంతు దిగేలా సూప్, లేదా మెత్తగా పప్పూ కూరలూ వేసి వండిన కిచిడీ - బస్. అంతేగా.

మధ్యాహ్నం లంచ్ తర్వాత కాస్సేపు రెస్ట్.

సాయంత్రం సీతామందిరానికో, శివరామక్షేత్రానికో వెళ్ళి ఆధ్యాత్మిక ప్రసంగాలు విందాం. లేదా వృద్ధాశ్రమానికో, అనాథశాలకో వెళ్ళి వాళ్ళతో కాలక్షేపం చేద్దాం. అదీ విసుగనిపిస్తే వరండాలో కుర్చీలు వేసుకుని హాయిగా చెప్పుకుందాం. మనం చదివిన పుస్తకాల్ని సమీక్షించుకుందాం లేదా మనం చూసిన సినిమాల్లో పాత్రల గురించి మాట్లాడుకుందాం.

రాత్రి డిన్నర్ తర్వాత వెన్నెల్లో ఈజీ చైర్స్ వేసుకున్నప్పుడు పాతరోజుల్ని అనుభవాల్ని నెమరేసుకుందాం. పంచుకుందాం.

పడుకోబోయే ముందు సుఖమైన మరణాన్ని ఇవ్వమని దేవుణ్ణి ప్రార్థించి, రవిశంకర్ సితారో, బిస్మిల్లా సన్నాయో వింటూ మధ్య మధ్య జ్ఞాపకమొచ్చిన సంగతులేవో చెప్పుకుంటూ ఎప్పుడో నిద్రలోకి జారుకుందాం.

ఓహ్ ఊహ మాత్రంగానే నాకు ఎంత ఉత్సాహం కలుగుతోందని!

మనసంతా వెన్నెల కుమ్మరించినట్టు చల్లగా. నా కాళ్ళకి బజ్జోడానికి అమ్మఒడి దొరికినట్టు అనిపించదా. మబ్బులు తొలగిన ఆకాశంలా నిర్మలంగా చిట్టచివరి గమ్యానికి చేరిన పక్షిలా రిలీఫ్‌గా హాయిగా చాలా హాయిగా అనిపిస్తోంది.

ఏం చెప్పను ఈ వ్రాతల్లోని ఊహాచిత్రమైన ఆనందాన్ని ప్రత్యక్షంగా పొందాలని నీకూ అనిపించడం లేదూ!

మౌళీ! ఎవరో ఏదో అనుకుంటారనీ, అందరికీ ఈ నిజం తెలపాలనుకుంటే ముందు ముందు ఏ అవాంఛనీయ పరిస్థితుల్లోనో మనల్ని ఎవరేమనుకుంటారని మనం సంకోచించాల్సిన పనిలేదు.

మనం కలిసి ఉండబోయేది నిష్కల్మషమైన స్నేహభావంతో. ఇది అందరికీ అర్థం కాక పోవచ్చు. నచ్చకా పోవచ్చు. అసలు అందరినీ ఒప్పించాల్సిన అవసరం మనకేమిటి? మన జీవితం మనది.

ఇక కాళ్లూ చేతులు పడిపోతేనో అని - ఆసుపత్రులున్నాయి, నర్సులున్నారు, చివరివరకూ సాకి సేవచేసే సంస్థలున్నాయి. ముఖ్యంగా నాచేతినిండా డబ్బుంది.

ఎందుకొచ్చిన తద్దినం అని లోలోన విసుక్కుంటూ ఇంత ముద్ద పడవేసే ఆయినవాళ్ల దగ్గర కంటే, వృత్తిధర్మంగా సేవలందించే పరాయివాళ్ల దగ్గర మూలగడమే నయమని నా ఉద్దేశ్యం.

చివరగా ఒక్కమాట.

తైలం ఇగిరిపోయి కొడిగడుతోన్న దీపాన్ని వత్తి ఎగసక తోసి చివరిసారిగా కాంతు విరజిమ్మించే ప్రయత్నమిది. సాదాసీదాగా అతి సామాన్యంగా నడిచిన కథకు కొసమెరుపు ఇవ్వాలనే ప్రయోగమిది.

నువ్విష్టపడితే ఈనెల ఇరవై నాలుగో తారీకు సోమోవారంనాడు, ఉదయం పదిగంటలకు హైదరాబాదు ఎయిర్‌పోర్టు లాంజ్‌లో నీకోసం ఎదురుచూస్తుంటాను. ఆ సమయం దాటి నిన్ను కలవలేకపోతే నెక్స్ట్ ఫ్లయిట్‌లో తిరిగి అమెరికా వెళ్లిపోతాను. నువ్వు తోడు లేకపోయిన్నాడు నాకు ఇండియా అయినా అమెరికా అయినా ఒకటే. తప్పక వస్తావనే ఆశతో ఎదురు చూసే - నీ వసుధ.

000

ఉత్తరం మడిచి పడక్కుర్చీలో వెనక్కి వాలాడు మౌళి. రెప్పలు మూసి ఏ ఆలోచనా రాకుండా మనసును నిగ్రహించే ప్రయత్నం చేశాడు. కుదిరింది కాదు.

ఎడమ చెయ్యెత్తి డేట్స్ కూడా చూపించే వాచ్ వంక చూసుకున్నాడు ఆరోజు మార్చి ఇరవైరెండు.

'రెండు రోజుల వ్యవధిలో ముప్పయ్యయిదేళ్ల గతం తాలూకా బంధనాల్ని వదిలించుకుని నూతన జీవితాన్ని ఆహ్వానించడం సాధ్యమా?' విరక్తిగా నవ్వుకోబోయాడు మౌళి.

'ఎందుక్కాదు?' ఎదురు తిరిగి ప్రశ్నించింది అంతరాత్మ.

బ్రతుకనేది దేవుడిచ్చిన బహుమతి. దాన్ని ఎటూ ఇంతవరకూ ఆనందమయం చేసుకోలేక పోయావు. కనీసం, వీశెడు అల్లం కొన్నందుకు చిన్ని బెల్లంముక్క కొసరు.' అన్నట్టుగా ఈ చివరిదశలో జాలిపడి దైవం మళ్లీ ప్రసాదించిన చిరుకానుక ఇది. తెలివిమాలి ఈ అవకాశాన్ని కూడా చేజార్చుకోకు' అని హెచ్చరిస్తోంది.

అప్పట్నించీ ప్రారంభమైంది మధన.

మనసులో ఒకవైపు వసుధ వర్ణించిన స్వర్గం అయస్కాంతక్షేత్రమై రారమ్మంటోంది. ఇంకోవైపు బంధువర్గం, తోబుట్టువులు ముఖ్యంగదా కొడుకూ కోడలూ తమ గురించి ఏమనుకుంటారో, ఏ కళంకమాపాదిస్తారో అన్న వెరపు వెనక్కి లాగుతోంది.

'నావాళ్లు అనుకున్న వాళ్లందరికోసం అన్నీ త్యాగం చేశాను. నా శక్తీ సంపదా ధారపోశాను. చివరికి నాకు మిగిలిందేమిటి? నిస్సారమైన జీవితం తప్ప' అన్న పశ్చాత్తాపం మొదలయింది.

'ఈ వృద్ధాప్యంలో, వంటరితనంతో బ్రతుకు ఇంక ఇంకా దుర్భరమవుతుందేమో' అన్న చింత భయపెట్టింది.

'ఇలాంటి సమయంలో తన స్నేహహస్తం సాచి 'నాదీ మసకచీకటి అలుముకోబోతున్న జీవితమే. ఒకరికొకరం తోడై మనకు మనమే చిన్ని దీపం వెలిగించుకుందాం రమ్మంటు'న్న వసుధ చేయెందుకు అందుకోరాదన్న ఆలోచన కలుగుతోంది.


కానీ అంతటి సాహసం తను చేయగలడా అని మళ్లీ ఊగిసలాట. ఈ డోలాయమాన స్థితిలోనే రెండు రోజులు గడిచిపోయాయి.

000

కొండల వెనుక సూర్యుడు అస్తమించ బోతున్నాడు. నది ఒడ్డున ఇసుకలో విరిగిన ఒక పడవకొయ్యమీద కూర్చుని చూస్తున్నాడు మౌళి.

సూర్యకాంతి చుట్టు ఉన్న ప్రకృతికీ పరిసరాలకూ ఎరుపురంగూ పులుముతోంది.

ఆ అరుణిమలో ఉదయపు తీక్షణతా చురుకూ లేవు. ఒకలాంటి ప్రశాంతతా, సుషుప్తికి ముందు కలిగే నిరామయస్థితి అగుపడుతోంది.




'అవును. ఇది పడమటి సంధ్య. దీనిలోనూ ఓ రాగం ఉంది. ఆరాగ మాధుర్యం వసుధలాంటి స్నేహ మయి సమక్షంలో సుధాసాగరం అవుతుంది. అందులో మునకలు వేసే అదృష్టాన్ని తను ఒదులు కోలేడు. ఒదులుకోడు.' మౌళి లేచాడు. ■